భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 24.0
తణుకు : 34.0 - 24.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 16 సెప్టెంబరు 2024



బయనపాలెంలో పోలీస్ బందోబస్తు

గణేశ్ నిమజ్జనంలో వివాదం

బయనపాలెంలో ఇరు వర్గాల దాడి 7లో

మళ్లీ పాత పాటే.!

- మాధవాయిపాలెం రేవు వేలం
- పూర్తి డిపాజిట్ చెల్లించని పాటదారు

నరసాపురం, సెప్టెంబరు 15: మాధవాయిపాలెం రేవు నిర్వహణలో మరోసారి అధికారులు పాత పాటే పాడారు. పాటదారు పూర్తిస్థాయిలో డిపాజిట్ సొమ్ము చెల్లించక న్నా నిర్వహణ అప్పగించడం చర్చనీయాంశమైంది. నిబంధనల ప్రకారం పాటదారు రెండు నెలల డిపాజిట్ రూ.48 లక్షలు చెల్లించాల్సి ఉంది. అధికారులు ఒక నెల సొమ్ము కట్టించుకుని రేవును అప్పగించేశారు. గతంలో పాటదారు రూ.50 లక్షల వరకు బకాయి పడ్డాడు. బాకీ వసూలు ఎంపీడీవో ఆత్మహత్యకు కారణమన్న వాదనలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో మళ్లీ అదే తంతు కొనసాగింది. గత నెల 28న రేవు వేలం నిర్వహించగా రూ 2.97 కోట్లకు యలమంచిలి మండలలానికి కనకదుర్గా సొసైటీ దక్కించుకుంది. ఈ నెల 1న ఒక నెల డిపాజిట్ రూ.24లక్షలు చెల్లించి రేవును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు వివరణ ఇస్తూ రెండు నెలల డిపాజిట్ చెల్లించలేదన్నారు. మొదట రూ. 24 లక్షలు, తర్వాత రూ.6 లక్షలు జమ చేశారన్నారు. రెండు రోజుల్లో బకాయి వసూలు చేస్తామన్నారు.

నేటి నుంచి పంటు రాకపోకలు

నరసాపురం టౌన్, సెప్టెంబరు 15: మాధవాయిపాలెం - సఖినేటిపల్లి రేవుల్లో సోమవారం నుంచి పంటు రాక పోకలు పునరుద్ధరిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్ర రావు తెలిపారు. గోదావరి వరదల కారణంగా ఐదు రోజుల క్రితం రాకపోకలు నిలిపివేశారు. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో అనుమతించారు.

పట్టణాల్లో ఖాళీ స్థలాలు

పట్టణాల్లో ఖాళీ స్థలాలు మునిసిపాల్టీకి గుదిబండగా మారాయి. వర్షాకాలం మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతున్నాయి. చెత్తచెదారం పేరుకుపోయి పరిసర ప్రాంతాల వారికి ఇబ్బందిగా పరిణమించాయి. ఖాళీ స్థలాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నులు విధించాలని ఆదేశాలు ఇచ్చినా ప్రయోజనం లేదు. స్థల యజమానులు అందుబాటులో లేకపోవడంతో అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేక పోతున్నారు. విదేశాల్లో ఉన్నవారు ఇక్కడ స్థలాలు కొనుగోలు చేయడం, వారు ఇక్కడ లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఖాళీ స్థలాలతో స్థానిక సంస్థలకు ఆదాయం లేకపోగా పారిశుధ్య నిర్వహణ భారంగా మారింది.



మున్సిపాలిటీలకు గుదిబండ

- ఆదాయం లేదు.. నిర్వహణ భారం
- అందుబాటులో లేని స్థల యజమానులు
- పారిశుధ్య సమస్య
- అధికారుల పాట్లు

జిల్లాలో ఖాళీ స్థలాలు	
భీమవరం	3338
తణుకు	3210
తాడేపల్లిగూడెం	1340
నరసాపురం	1550
పాలకొల్లు	12680

భీమవరం టౌన్, సెప్టెంబరు 15: జిల్లాలో భీమవరం, తాడే పల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లో వేల కొలది ఖాళీ స్థలాలు సమస్యాత్మకంగా మారాయి. వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు నిల్వతో దోమలు వ్యాప్తిచెంది వ్యా ధులు విజృంభిస్తున్నాయి. గతంలో ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకోడానికి మునిసిపాలిటీ అధికారులు దృష్టి సారించారు. తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ పరిధిలోని పలు స్థలాల్లో బో ర్డులు ఏర్పాటు చేశారు. స్థలాలను మెరక చేసుకోవాలని సం బంధిత యజమానులకు నోటీసులు ఇచ్చారు. కొంతవరకే ఫలి తాలు సాధించినా తరువాత పరిస్థితి యథాతథం. ఖాళీస్థలా లు మురికి కూపాలుగా మారి పిచ్చి మొక్కలతో చిట్టి అడవు లను తలపిస్తున్నాయి. రాత్రి వేళ పాముల సంచారంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురవుతున్నారు.

ఆదాయం పెంచాల్సిందే

కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఆదాయం పెంచే దిశ గా చర్యలు చేపట్టింది. పట్టణాల్లో పన్నులు సక్రమంగా వెయ్యాలని ఆదేశాలు వచ్చాయి. గతంలో సర్వేలు నిర్వహించి ఆస్తిపన్ను విధించినా ఖాళీస్థలాలపై మాత్రం చర్యలు తీసుకో లేకపోయారు. ఇప్పటికీ మునిసిపాల్టీలకు ఖాళీస్థలాలపై ఆశించన ఆదాయం రావడం లేదు. ఖాళీ స్థలాలు మెరక చేయాలని మునిసిపల్ అధికారులు ఆదేశించినా స్పందన లే దు. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ స్థలాలన్నీ చెరువులను తలపించాయి. వాటి నుంచి మురుగు వెళ్లే మార్గం లేదు. వాతావరణం పొడిగా ఉన్నా పారిశుధ్య సమస్య సాధారణం. ఏమాత్రం వర్షాలు పడితే అనారోగ్య పరిస్థితులకు ఆలవాలం గా మారాయి. ఖాళీ స్థలాల్లో మురుగును పందులు ఆవాసా లుగా చేసుకుని మరింత దుర్గంధభరితం చేస్తున్నాయి.

పట్టణాల్లో సర్వే నిర్వహించి ఇప్పుడిప్పుడు ఖాళీ స్థలాలను గుర్తిస్తున్నారు. రీ సర్వే చేసిన మునిసిపాల్టీలల్లో యజమా నులు ముందుకు వస్తున్నారు. జిల్లాలో తాడేపల్లిగూడెంలో పైలెట్ ప్రాజక్టుగా రీ సర్వే పూర్తిచేసారు. అక్కడ గడచిన రెండేళ్లుగా 800 స్థలాలపై పన్నులు వేశారు. దీనివల్ల మునిసి పాల్టీ ఆదాయం పెరిగింది. భీమవరంలో రీసర్వే పూర్తి చే శారు. ఇంకా పన్నులు నిర్ధారించలేదు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పన్నులు వేసే ప్రక్రియను చేపట్టారు. జిల్లాలో మిగిలిన మునిసిపాల్టీలలో రీ సర్వే చేపట్టాల్సి ఉంది.

యజమానులు ఎక్కడ

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయడం మునిసిపల్ అధికారులకు తలనొప్పిగా మారింది. రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి సమాచారం తీసుకుని నోటీసు ఇవ్వాలని భావిస్తే కొంతమంది ఇతర దేశాల్లో ఉన్నట్లు తెలియడంతో ఇబ్బందికరంగా మారింది. అధికారులు పూర్తిస్థాయి సమా చారం తీసుకుని వారికి నోటీసులు జారీచేసే పనిలో ఉన్నారు.

బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం పట్టణాలల్లో బ్లాక్‌స్పాట్ లను గుర్తించి చెత్త ఉన్న ప్రాంతాలను నమోదు చేశారు. ప్రస్తుతం ఖాళీస్థలాల్లో చెత్త వేస్తున్న నేపథ్యంలో వాటిని బ్లాక్ స్పాట్‌లుగా అధికారులు గుర్తించి చర్యలు చేపడుతున్నారు. వాటికి జీపీఎస్ ఏర్పాటుచేసి చెత్తవెయ్యకుండా చర్యలు తీసు కున్నారు. తర్వాత వైసీపీ ప్రభుత్వ పాలనలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. పైగా చెత్త వాహనాలపే రుతో భారం మోపారే తప్ప చెత్త నివారణకు ఎటువంటి చర్య లు చేపట్టలేదు. ఇప్పుడు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు.



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద అంగర, నిమ్మల నివాళి

దేశం గర్వించదగ్గ గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య

ఇంజనీర్లను సత్కరించిన మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 15: దేశం గర్వించదగ్గ గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం స్ఫూర్తిదాయక మని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మోక్షగుం డం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా పాలకొల్లు జల వనరులశాఖ ఇంజనీరింగ్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఇంజనీరింగ్ డే వేడుకల్లో మంత్రి నిమ్మల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నిమ్మల రామానాయుడు, అంగర రామ్మోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగ విరమణ చేసిన, సీనియర్ ఇంజనీర్లను మంత్రి రామానాయుడు సత్కరించారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య, కె.ఎల్.రావు, కాటన్, శివరామకృష్ణయ్య వంటి మహనీయుల జయంతిని కూడా గత ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. ఆ మహనీ యుల ఆత్మలు క్షోభించేలా జగన్ పాలనలో ఇరిగేషన్ ప్రాజె క్టులు, సాగునీటి వ్యవస్థలు విధ్వంసానికి గురయ్యాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బుడమేరకు రూ.40 కోట్లు కేటాయించి 80శాతం పనులు పూర్తిచేశామని గత ప్రభుత్వం బుడమేరును గాలికొదిలేసిందన్నారు. కార్యక్రమం లో జల వనరుల శాఖ ఎస్ఈ దేవప్రకాశ్, ఈఈ దక్షిణా మూర్తి, ఎన్డీఏ నాయకులు పెచ్చెట్టి బాబు, జీవీ, మామిడిశెట్టి పెద్దిరాజు, ఉన్నమట్ల కబర్ధి, కోడి విజయభాస్కర్, కర్నేని గౌరునాయుడు, జక్కంపూడి కుమార్, ఆరుమిల్లి రామ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



స్టేడియం కోసం స్థలం పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెంలో క్రికెట్ స్టేడియం

స్థలం పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15: తాడేపల్లిగూడెంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో స్టేడియం నిర్మాణానికి తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను జడ్పీ భూములను పరిశీలించారు. తర్వా త ఆ ప్రస్తావనే లేకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ క్రికెట్ స్టేడి యం నిర్మాణంపై దృష్టి సారించారు. నన్నయ యూనివర్శిటీ క్యాంపస్ ఎదురుగా ఉన్న 12 ఎకరాల భూమిని స్టేడియం కోసం కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు.

గతంలో స్టేడియం నిర్మాణానికి తాడేపల్లిగూడెంకు దూరంగా ఆరుగొలనులో ఏర్పాటుకు పరిశీలించినా కార్యరూపం దాల్చలే దు. తాజాగా ఏపీ నిట్, నన్నయ క్యాంపస్ సమీపంలోని స్థలం పరిశీలించడంతో అందరికి అందుబాటులో ఉంటుందని పలువు రు భావిస్తున్నారు. దీనికితోడు తాడేపల్లిగూడెం సమీప ప్రాంతా ల్లోని పలు క్రీడా అసోసియేషన్లు నిర్వహించే ఈ స్థలంలోనే టోర్నమెంట్‌లు నిర్వహిస్తుంటారు.

స్థలం అప్పగిస్తే స్టేడియం నిర్మిస్తాం

క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం 12 ఎకరాల స్థలాన్ని అప్పగిస్తే దాతల సహకారంతో నిర్మాణ బాధ్యత తీసుకుంటా మని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే క్రీడాభి మానులందరికీ ఆనందాన్నిచ్చే క్రికెట్ స్టేడియం నిర్మాణం కార్య రూపం దాలుస్తుందని పలువురు భావిస్తున్నారు.

రేపు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

భీమవరం టౌన్, సెప్టెంబరు 15: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఈ నెల 17న ఆల్ బెండజోల్ మాత్రల పంపిణీ నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుమారు 3,64,400 మంది కి మాత్రలు అందించడం లక్ష్యమన్నారు. మాత్రలను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యా సంస్థలకు సరఫరా చేయాలని వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించారు. పిల్లలకు మాత్రలు వేసేలా ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరికైనా స్వల్ప అస్వస్థత అనిపిస్తే పీహెచ్‌సీలలో అవసరమైన చికిత్స చేయాలన్నారు.

రాయితీపై సోలార్ విద్యుత్ కనెక్షన్

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనలో సోలార్ విద్యుత్ కనెక్షన్లు రాయితీపై అందిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. దీనితో గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యు త్ బిల్లు వస్తుందన్నారు. ఇంటి కప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు లేదా 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. రూ.35 వేల నుంచి రూ.78 వేల వరకు ప్రభుత్వ సబ్సిడీ పొందవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కలిగించాలన్నారు. సోలార్ రూఫ్ ఏర్పా టు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

భీమవరం టౌన్ / క్రైం, సెప్టెంబరు 15: కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్య ల పరిష్కార వేదిక రద్దయింది. మిలాద్ ఉన్ నబీ కారణంగా రద్దు చేసినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలియజేశారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో చీఫ్ ధనాని సూర్యప్రకాష్

జాతీయ కరాటే పోటీల్లో పాలకొల్లు విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు, సెప్టెంబరు 15 : ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శని, ఆదివారాల్లో నిర్వహించిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పాలకొల్లుకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్టు పట్టణానికి చెందిన జపాన్ షోటోఖాన్ కరాటే చీఫ్ ధనాని సూర్యప్రకాష్ తెలిపారు. 14 ఏళ్ల లోపు ఆల్ కలర్ బెల్ట్ (కటా కుమితే) విభాగంలో 17 మంది పాల్గొన్నారని, వారికి వివిధ పోటీల్లో 30 స్థానాలు లభించాయని ప్రకాష్ తెలిపారు. ప్రథమ స్థానం 13 మందికి, ద్వితీయ స్థానం 11 మందికి, తృతీయస్థానం ఆరుగురికి లభించిందని, బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పోటీలో రూబి నమ్రత, ఎన్‌జ్యోత్స్నే ఇద్దరికీ బ్లాక్ బెల్ట్‌లు లభించాయన్నారు. విద్యార్థులను కరాటే మాస్టర్స్ సిహెచ్ లక్ష్మీనారాయణ, ఎన్.అప్పలస్వామి తదితరులు అభినందించారు.



విజేత జట్టుకు చాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

జాతీయస్థాయి కరాటే పోటీల విజేతలు

పెదపాడు, సెప్టెంబరు 15: క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జాతీయ స్థాయి షోటోకాన్ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. రెండు రోజులు జరిగిన కరాటే పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను కనుస్నుకు సికో షోటోకాన్ ఆధ్వర్యంలో బడేటి కప్పు పేరుతో పోటీలను నిర్వహించగా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు సత్తా చాటి చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బడేటి చంటి విజేత జట్టుకు చాంపియన్‌షిప్ ట్రోఫిని అందజేశారు. ఎండీ బేగ్, డీఎల్ నారాయణ, నాగంశివ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రఘురామ తదితరులు

చదరంగం విజేతలకు బహుమతులు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 15: తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. భీమవరం శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి.మంత్రి వర్మ, ఎమ్మెల్యే రఘురామలు బహుమతులు అందించారు. జిల్లా చదరంగ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ విజేతలుగా ప్రథమస్థానంలో నిలిచిన ఐలూరి హరి సూర్యనారాయణ(ఏపీ) 60 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన దివాకరన్ (తమిళనాడు) 50వేలు, తృతీయ తురక రాజు(తెలంగాణ) 35 వేల నగదును గెలుచుకున్నారన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, తోట హరిబాబు, శివరామరాజు, మైలాపురి మురళి, కంతేటి వెంకట రాజు, శ్రీనివాసరావు, అల్లుశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 15 : మహాత్మాగాంధీ 156వ జయంతి పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో విద్యార్థులకు 'గాంధీ తత్వం-నేటి భారతం' అంశంపై ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. చిత్రాలను ఏ4 షీటుపై వేసి స్కాన్ చేసి జీట్కుచీట్కుజ్యోఃజుల్లుజీజూ.ఛౌరు అడ్రసుకు 24వ తేదీలోపు పంపాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చునని విజేతలకు అక్టోబరు 2న బహుమతులు అందజేస్తారన్నారు. వివరాలకు 99490 93115 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునన్నారు.

అశోక్ శ్రీనివాస్ కుటుంబానికి వైఎస్ విజయమ్మ పరామర్శ



శ్రీనివాస్ సతీమణిని ఓదారుస్తున్న విజయమ్మ



కేవీపీతో ఎమ్మెల్యే రఘురామ

కామవరపుకోట, సెప్టెంబరు 15: చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ ఆత్మకు శాంతి కలగాలని వై.ఎస్ విజయమ్మ అన్నారు. ఆదివారం కె.ఎస్ రామవరంలోని అశోక్ శ్రీనివాస్ గృహానికి విజయమ్మ వెళ్ళి ఆయన చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ సతీమణి, కామవరపుకోట ఎంపీపీ మేడ వరపు విజయలక్ష్మిని ఓదార్చారు. ఉండి ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు నివాళు లర్పించారు. కేవీపీ రామ చంద్రరావుతో మాట్లాడారు.



దర్నా చేస్తున్న మంగళగుంటపాలెం గ్రామస్థులు

కంపోస్టు మా గ్రామంలో వద్దు

రెండో రోజు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ధర్నా

నరసాపురం టౌన్, సెప్టెంబరు 15: కంపోస్టుయార్డు ఆందోళన రెండోవ రోజు ఆదివారం కొనసాగింది. పురపాలక సంఘానికి సంబంధించిన డపింగ్‌యార్డును మా గ్రామంలో వొద్దంటూ మంగళ గుంటపాలెం గ్రామస్థులు ఊరేగింపుగా ఎమ్మెల్యే కార్యాలయం వద్ద తరలివచ్చారు. పురుగుల మందు డబ్బాలు చేతబట్టి ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే నాయకర్ స్థాని కంగా లేరు. కార్యాలయంలో ఉన్న జనసేన నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని, గంటా కృష్ణలు గ్రామస్థులకు సద్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయి నప్పటికీ తగ్గలేదు. ఎమ్మెల్యే వచ్చేవరకు ఆందోళన విరమించమని భీష్మించారు. దీంతో ఎమ్మెల్యే గ్రామస్థులతో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాసా సత్యనారాయణ, వెంకట రామరావు, వెంకటేశ్వరావు, రమేష్, చందు, భాను, గంగా భవాని, లక్ష్మి, దుర్గా, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బా బో య్


బుస్.. బుస్‌లు



వరదలతో అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న పాములు

కట్లపాము, రక్తపింజర, పాడ,తాచుపాములే ఎక్కువ

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రోజుకు నాలుగు నుంచి ఏడుగురు పాము కాటు బాధితులు



ఏలూరు క్రైం/ అత్తిలి, సెప్టెంబరు 15 : ఇటీవల జిల్లాలో వచ్చిన వర్షాలకు వరద ప్రవాహంతో అడవుల్లో ఉన్న పాములు వర దలకు కొట్టుకువచ్చి గ్రామాలపై పడ్డాయి. మరికొన్ని పాములు ఆ వరద ప్రవాహంలో కొట్టుకొచ్చి సమీపం లోని పొలా ల్లోకి చేరాయి. కొల్లేరు, తమ్మిలేరు, బుడమేరు, రామి లేరు, ఏజెన్సీలో కొండవాగుల వరదలతో పలు ప్రాంతాలు నీటమునిగాయి. వరద నీటిలో పాములు కొట్టుకువచ్చి ఊళ్ల మధ్యకు చేరాయి. ఇటీవల ఏలూరు ప్రభుత్వాస్పత్రికి రోజుకి నాలుగు నుంచి ఏడు కేసులు పాము కాటుకు గురైన వారు వస్తున్నారంటే ఈ పాములు ఏ విధంగా ప్రజల మధ్యలోకి వచ్చాయో అర్థం చేసుకోవచ్చు.పొలం పనులకు వెళ్లిన వారు, పొలంలో గడ్డి కోసేవారు, గట్లపై నడిచేవారే ఎక్కువ పాముకాటుకు గురవుతున్నారు. వర్షాకాలం కావడంతో వర్షాలు పడేటప్పుడు కట్లపాములు ఇళ్లమెట్ల వద్ద పడుకుని ఉంటాయి.

రైతులు, కూలీలు.. జాగ్రత్త

వర్షాలు, వరదలతో కలుగుల్లో దాక్కున్న పాములు బయటకి వస్తున్నాయి. పొలం పనులకు వెళ్తున్న వారిని కాటేసి ప్రాణాలు బలిగొంటున్నాయి. రెండు నెలలుగా పాము కాటు బాధితులు పెరుగుతున్నారు.వరి పొలాల్లో ఎక్కువగా పాముల బెడద ఉంటుంది.రైతులు, కూలీలు జాగ్రత్తగా ఉండాలి.

అన్నీ విష కారకం కాదు

పాములన్నీ విషకారకం కావని వైద్య సిబ్బంది తెలిపారు. పాము కరిచిన చోట రెండు గాట్లు ఉంటే 90 శాతానికి పైబడి విషకారక పాము కాదని భావిస్తామన్నారు. పాముకాటు బాధితు లకు రక్తం వాంతులు, మలమూత్ర విసర్జన సమయంలో రక్తస్రావం, మగత ఉంటాయన్నారు. విషకారక పాము కాటుకు వెంటనే చికిత్స తీసుకోకుంటే కిడ్నీలతో పాటు శరీరంలోని ముఖ్య అవయవాలన్నీ పాడైపోతే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందన్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితికి అను గుణంగా ఒకటి నుంచి నాలుగు వరకూ ఏఎస్‌వీ ఇంజక్షన్లు వేసి ప్రాణాలు కాపాడతామన్నారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

భూమిపైన వస్తువులను చప్పుడు చేస్తూ వెళ్ళితే ఏమైనా పాములు ఉన్నా ఆ శబ్దానికి పారిపోతాయి. సుమారు ఐదు అడుగుల పొడవు ఉన్న కర్ర ఎప్పుడూ చేతిలో ఉండాలి. పాము ఉన్న చోట చుట్టూ కందకం తవ్వాలి లేదా కళ్ల ఉప్పు మూడు రోజులకు ఒకసారి చల్లాలి. ఉప్పు పాము చర్మానికి అసౌకర్యం కలిగిస్తుంది. తడి నేలమీద పాములు పాకిన గుర్తులు కనిపిస్తాయి. పాముల సంచారం కనిపిస్తే పక్షులు అరుస్తాయి. అలాగే కుక్కలు కూడా పాములు కనిపిస్తే సూచన చేస్తాయి. పాములు కేవలం మోకాలు ఎత్తు లేదా కొంచెం ఎక్కువ ఎత్తు వరకూ మాత్రమే చేరతాయి. పాములు తిరిగే చోట పనిచేసే వాళ్ళు మోకాళ్లపై వరకూ కప్పి ఉంచే గమ్‌బూట్‌తో పాటు మందంగా ఉండే జీన్స్ ధరిస్తే రక్షణ నిస్తాయి.

గంట వ్యవధిలో తీసుకు వస్తే ప్రాణాలు కాపాడవచ్చు



పాము కాటుకు గురైన వారిని నడవ నివ్వకూడదు. చేతులపైన భుజం పైన ఎత్తుకుని తీసుకురావాలి. కాటు జరిగిన ప్రదేశంలో ఎలాంటి కట్లు కట్టకూడదు. ఎన్ని గంటలకు కరిచిందో ఖచ్చితంగా సమయాన్ని గుర్తుంచు కోవాలి. ఆస్పత్రికి రాగానే బ్లీడింగ్ టైమ్, క్లాటింగ్ టైమ్ (బీటీసీటీ) పరీక్ష నిర్వహిస్తాం.రక్తం ఎంత సమయంలో గడ్డ కడుతుందో నిముషాల్లో చూస్తాం. సాధారణంగా పది నిముషాల్లోపు గడ్డ కడితే విషం ప్రభావం అంతగా లేనట్టే. గడ్డ కట్టకుండా ఎక్కువ సమయం తీసుకుంటే విష ప్రభావం రక్తంలో కలిసి పోయిందని గుర్తించి యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) వైల్స్‌ను సెలైన్‌లో కలిపి ఎక్కిస్తాం. సాధారణంగా బీటీసీటీ పరీక్ష ఆధారంగా రోజుకు పది నుంచి 20 వైల్స్ వరకు ఎక్కించి విషానికి విరుగుడు చేస్తాం. పాము కాటు వేసిన తర్వాత గంట వ్యవధిలోనే తీసుకొస్తే రక్తపరీక్షలు నిర్వహించి వైద్యం అందించడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎక్కువగా కట్ల పాములు, రక్తపింజర, పొడపాములు కాటుకు గురైన వారు ఆస్పత్రికి వస్తున్నారు.

- డాక్టర్ ఎం.సుమన్, అత్యవసర విభాగపు వైద్య నిపుణులు, ప్రభుత్వ ఆసుపత్రి, ఏలూరు



ఆసుపత్రి వద్ద బాలిక తాత రోదన.. మృతిచెందిన బాలిక మధుర

పాముకాటుకు బాలిక మృతి

ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆందోళన

భీమవరం క్రైం, సెప్టెంబరు 15 :పాము కాటుకు గురైన బాలికకు వైద్యం చెయ్యకుండా వైద్యులు నిర్లక్ష్యం చేసి మృతికి కారణం అయ్యారు అని బంధువులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం ఉండి మండలం మహేదేవపట్నం గ్రామానికి చెందిన తుమ్మిడి సతీష్, దుర్గాలక్ష్మీ దంపతులకు ఇద్దరు కవలలు. పెద్ద కుమార్తె అయిన తుమ్మడి మధుర (7)శనివారం ఆడుకుంటూ రోడ్డుపైకి రావడంతో పాముకాటుకు గురైంది. తల్లితండ్రులు వెంటనే గ్రామంలోని ఆర్ఎంపీ దగ్గరకు తీసుకువెళ్ళగా వెంటనే పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్ళాలని చెప్పడంతో భీమవరం ఉండి రోడ్డులో ఉన్న ఒక ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ జాయిన్ చేసుకున్న వైద్యులు సుమారు 2 గంటల తరువాత వేరే ఆసుపత్రికి తీసుకువెళ్లమని చెప్పడంతో వారు హుటాహుటిన వేరే ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలిక మృతి చెంది అరగంట అవుతుందని చెప్పారు.

ఆసుపత్రి వద్ద ఆందోళన

ముందుగా వైద్యం చేసిన ఆసుపత్రికి మృతదేహాన్ని తీసుకుని బంధువులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలిక మృతి చెందింది అంటూ నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై బైఠాయించి సుమారు 8 గంటల పాటు రాస్తారోకో చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. చివరకు తెల్లవారుజామున 5గంటలకు ఆందోళన విరమించారు.

పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్లు ఉన్నాయి : డీఎంహెచ్‌వో

ఆకివీడు రూరల్ : పాముకాటుకు విరుగుడు వ్యాక్సిన్లు అన్ని ప్రాథమిక ఆసుపత్రులలో సిద్ధం ఉన్నాయని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు అన్నారు. వరదల కారణంగా పాములు జనసంచారంలోనికి వస్తున్నాయి. పాము కరవగానే కంగారు పడకుండా దగ్గరగా ఉండే ప్రాథమిక ఆసుపత్రికి తీసుకు వెళ్లాలి. పాము కరిచినచోట నోటితో రక్తం పీల్చడం, కాల్చడం వంటివి చెయ్యకూడదు. ఒత్తిడికి గురవ్వకుండా ప్రశాంతంగా ఉండి ప్రాథమిక చికిత్స పొందాలని సూచించారు. పంచాయతీలు గ్రామాలలో చెట్లు, పొదలు, తుప్పలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బయనపాలెం గణేశ్ ఉత్సవాల్లో ఉద్రిక్తత

ఊరేగింపులో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ

పలువురికి గాయాలు.. మోహరించిన పోలీసులు

నరసాపురం రూరల్, మొగల్తూరు,సెప్టెంబరు 15: నరసాపురం మండలం ఎల్‌బీ చర్ల గ్రామంలోని బయనపాలెం ఆదివారం రాత్రి గణేష్ నిమజ్జనం ఊరేగింపులో ఇరు సామాజిక వర్గాల మధ్య తలెత్తిన వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఊరేగింపు సాగుతున్న సమయంలో ఒక పాట వేయడాన్ని మరో సామాజిక వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఇరు వర్గాల మధ్య జరిగిన వాదోపవాదాలు ఘర్షణలకు దారితీశాయి. ఇరువురు పరస్పరం రాళ్ళతో దాడులు చేసుకున్నారు. దాదాపు మూడు గంటల పాటు గ్రామంలో హైటెన్షన్ నెలకొంది. ఇద్దరు పోలీసులతో పాటు పలువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన తిరుమాని రాజేష్‌ను స్థానికులు నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇద్దరు కానిస్టేబుళ్ళు కూడా రాళ్ళదాడిలో గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం గ్రామంలో మూడు రోజుల క్రితం గణేష్ ఊరేగింపు సందర్భంగా ఒక సినిమా పాట వేయడాన్ని గ్రామంలోని మరో సామాజిక వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. తరువాత గ్రామ పెద్దలు ఈ పాటను వేయవద్దని ఆదేశించారు. అయితే ఆదివారం సాయంత్రం మరో సామాజిక వర్గం ఇదే పాటను వేస్తూ ఊరేగింపుగా వెళ్ళుతుండగా మళ్లీ ఆ సామాజిక వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఇరువురు మధ్య మాట మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. పరస్పరం రాళ్ళు విసురుకున్నారు. ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ సీఐ కృష్ణ ప్రసాద్ మొగల్తూరు, రూరల్ ఎస్‌లు గ్రామానికి చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. పరిస్థితి పూర్తి అదుపులో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు.





పోలీసుల పహరా..ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15: గణపతి వేడుకల్లో జరిగిన ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న ఎం.ప్రసన్నకుమార్ (23) ఆదివారం మృతి చెందాడు. ఈనెల 10న తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి సమీపంలో గణపతి వేడుకల్లో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో మెకానికర్ ప్రసన్నకుమార్‌ను అదే ప్రాంతానికి చెందిన యర్రా సతీష్ స్టేజ్‌రాడ్డుతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే కూలబడిపోయాడు. రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించగా చికిత్స పొందుతున్న ప్రసన్నకుమార్ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 2,633 కేసులు పరిష్కారం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 2,633 కేసులు పరిష్కారం జరిగినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్ తెలిపారు. ఈనెల 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లా అడ్మిన్ జడ్జి, హైకోర్టు జడ్జి సురేష్ రెడ్డి ఆదేశాలతో లోక్ అదాలత్‌లో 33 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరులో 8, భీమవరంలో 4, కొవ్వూరులో 3, నర్సాపురంలో 4, తణుకులో 4, తాడేపల్లిగూడెంలో 4, పాలకొల్లు 2, నిడదవోలు 1, జంగారెడ్డిగూడెం 2, చింతలపూడి 1, భీమడోలు 1 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 2,146 క్రిమినల్, 124 మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, 193 సివిల్, 170 ప్రీలిటిగేషన్ కేసులు ఆన్‌లైన్ ద్వారా 23 కేసులను పరిష్కరించామన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

డీటీసీ డీఎస్పీగా ప్రసాదరావు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15 : ఏలూరు జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం డీఎస్పీగా ప్రసాదరావును నియమించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న డీఎస్పీలలో 47 మందిని బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న డీఎస్పీ ప్రసాదరావును జిల్లా ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీగా నియమించారు.

తాడేపల్లిగూడెం డీఎస్పీగా విశ్వనాథ్



తాడేపల్లిగూడెం రూరల్ :సీఐడీ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న డి.విశ్వనాథ్‌ను తాడేపల్లిగూడెం సబ్ డివిజినల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ)గా నియమించారు. ఇప్పటి వరకూ తాడేపల్లిగూడెం డీఎస్పీగా పనిచేస్తున్న మూర్తిని ఏసీబీ విభాగానికి బదిలీ చేశారు.





వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్..పోలీస్ జాగిలం పరిశీలన

కేపీపాలెం జ్యూయలరీ షాపులో భారీ చోరీ

రూ.40 లక్షలు విలువ చేసే బంగారం అపహరణ

పట్టుకెళ్లని వెండి వస్తువులు..పోయిందంతా తాకట్టు బంగారమే

నరసాపురం/మొగల్తూరు, సెప్టెంబరు 15: నరసాపురం మండలం తూర్పుతాళ్ళు, మొగల్తూరు మండలం కేపీపాలెం సరిహద్దునున్న దుర్గా జ్యూయలరీలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు రూ.40 లక్షలు విలువ చేసే బంగారు వస్తువులను దుండగులు అపహరించుకుపోయారు. వెండి వస్తువులను ముట్టుకోలేదు. చోరీకి గురైన వస్తువులన్నీ తాకట్టు బంగారమే. శనివారం ఇదే మండలంలోని రామన్నపాలెంలో ఓ ఇంట్లో చోరీ జరిగిన కొన్ని గంటలకే మరో భారీ దొంగతనం వెలుగుచూడటం తీరంలో చర్చనీయాంశమైంది. రామన్నపాలెంలో జరిగిన చోరీలో దుండగులు సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను ఎత్తికెళ్లారు. అదే తరహాలో ఈ బంగారం దుకాణంలో కూడా ఎటువంటి ఆధారాలు లేకుండా హార్డ్ డిస్క్‌ను తీసుకెళ్లడంతో రెండు చోరీలు ఒకే ముఠా చేసిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కథనం ప్రకారం నరసాపురం మండలం ఎల్‌బీ చర్ల గ్రామానికి చెందిన చామకూరి గోపి కొన్నేళ్ల నుంచి మొగల్తూరు, నరసాపురం మండలాల సరిహద్దునున్న కేపీపాలెంలో జ్యూయలరీ, తాకట్టు వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శనివారం దుకాణం కట్టి వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం వెండి వస్తువు కోసం కస్టమర్ ఫోన్ చేశాడు. అయితే యాజమాని వెళ్ళకుండా షాపులో పనిచేసే వర్కర్‌కు తాళాలు ఇచ్చి పంపించాడు. షాపు తీయగానే పైన కన్నం వేసి ఉంది. వస్తువులన్నీ చిందరబందరగా పడ్డాయి. వెంటనే యాజమానికి ఫోన్ చేయడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

పక్కా ప్లాన్‌తోనే చోరీ..

ఈ చోరీ పక్కా ప్లాన్‌గా జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దుకాణానికి కొంది దూరంలోని మామిడితోటలో తాపీపనులకు అద్దెకిచ్చే పని ముట్ల దుకాణం ఉంది. అక్కడ నుంచి చెక్క నిచ్చెన తీసుకొచ్చి దుకాణం వెనుక నుంచి పెకి ఎక్కి కన్నం పెట్టారు. లోపల ఉన్న వెండి వస్తువుల్ని ముట్టకోలేదు. తాకట్టులో ఉన్న బంగారాన్ని మాత్రమే చోరీ చేశారు. శనివారం సాయంత్రం ఈ గ్రామానికి సమీపంలో ఉన్న రామన్నపాలెంలో ఇదే తరహాలో చోరీ జరిగింది. 8 కాసుల బంగారాన్ని ఎత్తికెళ్లారు.ఈ రెండు చోరీలు ఒకే తరహాలో జరగడంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. సంఘటన స్థలాన్ని జిల్లా అదనపు ఎస్పీ భీమరావ్, డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై వాసులు సందర్శించారు. జిల్లా నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. కుక్కలు గ్రామ శివారున్న బ్యాంకు వరకు వచ్చి అగిపోయాయి.

వినాయక ఉత్సవ మండప కార్యాలయంలో చోరీ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15: ఎం.నాగులపల్లి పంచాయితీ పరిధిలోని ద్వారకానగర్‌లోని వినాయక ఉత్సవ మండపంలో జొరపడి దొంగతనానికి తెగబడ్డారు. అక్కడున్న విలువైన దస్త్రావేజులు, రసీదు పుస్తకాలు, దాతల వివరాలతో ఉన్న పుస్తకాలు అపహరించారు. అయితే వాటితో పాటు ఉన్న నగదును తస్కరించకపోవడంతో ఇది ఇంటిదొంగల పనే అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై కమిటీ అధ్యక్షుడు అబ్బూరి రాంబాబు ఆదివారం ఉదయం ద్వారకాతిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు

క్రైం కార్నర్..





వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రవిచంద్ర.. స్వాధీనం చేసుకున్న సొత్తు

నలుగురు దొంగల అరెస్ట్

అరవై గ్రాముల బంగారం, అరకేజీ వెండి స్వాధీనం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 15 : వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.నాలుగు లక్షల ముప్పై ఐదు వేల విలువైన అరవై గ్రాముల బంగారం, అరకేజీ వెండి స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ రవిచంద్ర వివరాలను వెల్లడించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో త్రివేణి కళాశాల వెనుక టీచర్స్ కాలనీలో ఓ ఇంటి తాళాలు పగలగొట్టి ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారని, అయ్యప్ప టౌన్ షిప్‌లోని మూడవ రోడ్డులో మరో ఇంటిలో చోరీకి పాల్పడ్డారని, కామవరపుకోట మండలం రావికంపాడులో జరిగిన చోరీలో సొమ్ము రికవరీ చేశామన్నారు. నేరస్థులైన కర్రి రాజేష్, కామంచి కోటేశ్వరరావు, సమ్మంగి మంగరాజు, తల్లాడి భాస్కర దుర్గాప్రసాద్ జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వారేనని వీరికి గతంలో కూడా నేర చరిత్ర ఉందని తెలిపారు. సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్, ఏఎస్సైలు ఎన్‌వి.సంపత్ కుమార్, ఎన్.రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెంటపాడు, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ముదునూరులో చోటు చేసుకుంది. అత్తిలి గ్రామానికి చెందిన ఏడిద సత్యనారాయణ (69) తాడేపల్లిగూడెం మార్కెట్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం తన పని ముగించుకుని మోటర్‌సైకిల్‌పై అత్తిలి వెళ్తుండంగా పిప్పర నుంచి తాడేపల్లిగూడెం వైపు వస్తున్న టాటా ఏస్ వాహనం ముదునూరు బంక్ వద్ద పెట్రోలు కొట్టించుకునేందుకు వాహనాన్ని తిప్పాడు. దీంతో మోటర్ సైకిల్‌పై వస్తున్న సత్యనారాయణ టాటా ఏస్ వాహనాన్ని ఢీకొని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించామని మృతుని కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పెంటపాడు ఎస్ఐ స్వామి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మొగల్తూరు,సెప్టెంబరు 15: వేధింపులు తాళలేక ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్నట్టు మొగల్తూరు ఎస్ఐ వాసు తెలిపారు. మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలేనికి చెందిన భూసి ఝాన్సీ మేరీ (32) ఈనెల 13 రాత్రి బహిర్భూమికి వెళ్ళింది.ఆ సమయంలో గ్రామానికి చెందిన నలుగురు యువకులు ఆమెను వేధించడంతో ఇంటికి వెళ్ళి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త కుమార్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాను ఢీకొని యువకుడి మృతి



ఏలూరు క్రైం, సెప్టెంబరు 15 : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువ కులు రోడ్డుపై ఆగి ఉన్న వ్యాను ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు గాయాలపాలయ్యాడు. భీమడోలు మండలం కురెళ్ళగూడానికి చెందిన ఎలక్ట్రీషియన్ వాదాడి భవానీ శంకర్ (20) ఆది వారం సాయంత్రం మోటారు సైకిల్‌పై మరో యువకునితో కలిసి తాడే పల్లిగూడెం నుంచి కురెళ్ళగూడెం వస్తుండగా జాతీయ రహదారిపై ప్యాచ్ వర్క్ చేస్తున్న వాహనం ఆగి ఉంది. ఆ వాహనాన్ని మోటారు సైకిలిస్టు ఢీకొట్టాడు. ఇద్దరికి గాయాలవగా హైవే పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే భవానీ శంకర్ మృతి చెందాడని నిర్ధారించారు. మరో యువకుడు చికిత్స పొందుతున్నాడు. ఆసు పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పల్నాడులో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకుల మృతి



రవికిషోర్



వడల కృష్ణ

నిడమర్రు (ఉంగుటూరు) సెప్టెంబరు 15 : పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలో జాతీయరహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఏలూరు జిల్లా నిడమర్రు గ్రామానికి చెందిన ఈబుచర్ల రవికిషోర్ (22), వడల కృష్ణ(31)లు తూర్పు గోదావరి జిల్లా కాకినాడ హేచరీ కంపెనీలో హాల్టింగ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. నెల్లూరు వెళ్లి రొయ్యల పిల్లల శాంపిల్స్ తీసుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఆదివారం తెల్లవారు జామున 3.30 గంటలకు తిమ్మాపురం గ్రామ పరిధిలోని తిరుమల నూలు పరిశ్రమ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు కుడివైపు వెనుక టైరు పంక్చరవడంతో కారును రోడ్డు పక్కన ఆపుకుని టైరు మార్చుకుంటుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఇరువురిని ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ సంఘటనలో రవికిషోర్ అక్కడికక్కడే మృతిచెందగా, కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. హైవే పెట్రోలింగ్ పోలీసులు గాయపడిన కృష్ణను అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ కృష్ణ ఆదివారం ఉదయం మృతిచెందాడు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దంపతుల అనుమానాస్పద మృతి

భార్యను హతమార్చి భర్త ఉరి ?



విచారణ నిర్వహిస్తున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర



మంచంపై భార్య మృత దేహం

కామవరపుకోట, సెప్టెంబరు 15 : కుటుంబ కలహాలతో భార్యను హత మార్చి అనంతరం భర్త ఉరి వేసుకున్న సంఘటన కామవరపుకోట మండలం రావికంపాడు పంచాయతీ వెంకటాపురంలో చోటుచేసుకుంది. జంగారెడ్డి గూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపిన వివరాల ప్రకారం వెంకటాపురం గ్రామానికి చెందిన మానుపాటి మరియ (26)తో పెరవలి మండలం పిట్లవేమవరం గ్రామానికి చెందిన మానుపాటి శ్రీనుతో ఆరేళ్ళ క్రితం వివాహం జరిగింది. వివాదాల కారణంగా శ్రీను పిట్లవేమవరంలోనే ఉంటున్నాడు. ఇటీవల పెద్దల సమక్షంలో చర్చలు జరిపి వారిద్దరిని కాపురం చేసుకునే విధంగా తీర్మానించారు.అప్పటి నుంచి పిట్లవేమవరంలోనే ఉంటూ తరచుగా శ్రీను వచ్చి వెళ్తున్నాడు. ఈ నేథ్యంలో శనివారం రాత్రి శ్రీను మరియ నివాసానికి వచ్చాడు. వారి మధ్య గొడవ జరిగినట్టు సమాచారం. మంచంపై మరియ మృతి చెంది పడి ఉంది. శ్రీను అదే గదిలో దూలానికి ఉరివేసుకుని ఉన్నాడు. కేసుపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ పేర్కొన్నారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు.

రూ.4.55 లక్షలతో నిర్మించే రోడ్డుకు భూమి పూజ

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 15: వైసీపీ ప్రభుత్వంలో నిలిచిన రహదారి నిర్మాణానికి ఎన్డీఏ ప్రభుత్వంలో మోక్షం లభించిందని.. ఈ ప్రాంతవాసుల కష్టాలు తీరనున్నాయని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పట్టణంలోని 22వ వార్డు శెట్టిపల్లివారి వీధిలో రూ.4.55 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రహదారులు నిర్మించిన దాఖలాలు లేవని విమర్శించారు. వి.గణేష్, అల్లం తాతాజీ, పెచ్చెట్టి బాబు, జీవీ, ధనాని సూర్యప్రకాష్, బందెల భాస్కరరావు, బి.శ్రవణ్, ధర్మవరపు అశోక్, శిడగం సూరి పాల్గొన్నారు.

డాక్టర్ స్వర్ణలతకు అవార్డు


డాక్టర్ స్వర్ణలతకు అవార్డు ప్రదానోత్సవ దృశ్యం

పాలకోడేరు, సెప్టెంబరు 15: విస్సాకోడేరుకు చెందిన సెయింట్ జోన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ డీఆర్. స్వర్ణలతకు ఆదివారం విజయవాడలో తెలుగు వెలుగు సాహితీ నంది అవార్డును సాంబశివ రావు, పూర్వపు నాసా శాస్త్రవేత్త, జాతీయ సంస్థ అధ్యక్షుడు రాజ్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. డాక్టర్ స్వర్ణలత 2001లో సెయింట్ జోన్స్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించి అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. మైండ్ పవర్ అనే బుక్ రచించి ఎంతో మందికి ఉపయోగపడే విధంగా ఆమె చేశారు. దీన్ని గుర్తించిన అవార్డు సభ్యులు, అధ్యక్షులు షాలోజు రాజ్‌కుమార్ అవార్డును ప్రదానం చేశారు. ఆమెను గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, ఎంపీటీసీ గాంధీ, గ్రామస్థులు అభినందించారు.

స్వచ్ఛతా హి సేవలో అందరూ భాగస్వాములు కావాలి

భీమవరంటౌన్, సెప్టెంబరు 15 : స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా ఈనెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ -2024లో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ-2024 బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర మంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించటమే ధ్యేయంగా ముందడుగు వేయాలన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మన పరిశుభ్రతే మన ఆరోగ్యమని, ఈ కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలని కోరారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, చల్లా రాము, ఆకుల కృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంచార శకటంతో వైద్య సేవలు

తణుకు, సెప్టెంబరు 15: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా మంచానికే పరిమితమైన వృద్ధులకు సంచార శకటం ద్వారా అందించే వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు, కె.ఇల్లింద్రపర్రు, వేల్పూరు, కె.సావరం గ్రామాల్లో పర్యటించి 9 మందికి వైద్య సేవలందించారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కోశాధికారి అర్థి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం అడ్డగింత

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15: తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీ గాయత్రి గుడి సమీపంలో ప్రైవేట్ సెల్ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం స్థానికులు ఆందోళన చేశారు. ఇప్పటికే సెల్ టవర్ ఉండటంతో స్థానికులు రేడియేషన్ వల్ల అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే 75 మీటర్ల దూరంలోనే మరో సెల్‌టవర్ నిర్మాణంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణం ఆపకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

జాతీయ యోగా పోటీలకు బడుగు చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15: తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జడ్పీ హైస్కూల్ వ్యాయామోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ జాతీయ యోగా పోటీలకు ఎంపికయ్యారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా భీమిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలవడమే కాక జాతీయ యోగా పోటీలకు ఎంపికయ్యారు. చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ అభినందించారు.


సమావేశమైన 2000-02 పీజీ సోషల్ వర్క్ బ్యాచ్ విద్యార్థులు

డీఎన్నార్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 :డీఎన్నార్ కళాశాలలో 2000-02లో 22 ఏళ్ళ క్రితం పీజీ సోషల్ వర్క్ చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. విద్యార్థులంతా ఒక చోట కలిసి పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. పిల్లలు, కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపారు. ఆచార్యులైన ప్రొఫెసర్ కోటేశ్వర రాజు, ఝాన్సీలక్ష్మీలను పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన ఏఆర్టీ కౌన్సిలర్ దాసి ప్రభాకర్‌రావు, న్యాయవాది పులి దిండి అంబేడ్కర్, ధర్మారావులను తోటి విద్యార్థులు అభినందించారు. అనంతరం పూర్వ విద్యార్థులకు ఆచార్యుల చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు.

తగ్గుముఖం పట్టిన ఉప్పుటేరు వరద ప్రవాహం


ఉప్పుటేరు రోడ్డు వంతెన వద్ద ప్రవాహం

ఆకివీడురూరల్, సెప్టెంబరు 15 : కొల్లేరులో నుంచి ఉప్పుటేరులోకి వచ్చే వరద నీరు ప్రవాహం తగ్గింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు రైల్వే వంతెన వద్ద ఉప్పుటేరు ప్రవాహం 2.50 మీటర్లుగా నమోదైంది. గత రెండురోజులలో 2.60 మీటర్ల నుంచి 2.50 మీటర్లకు తగ్గింది. ఎండలు ఎక్కువగా ఉండడం, వర్షాలు లేకపోవడం, ఎగువ నుంచి వరద నీరు తగ్గిపోవడంతో వరద తగ్గుతుందని అధికారులు తెలిపారు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటే నీటి మట్టం మరింత తగ్గుతుందని ముంపు నుంచి బయటపడవచ్చని తెలుపుతున్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

ఉండి సెప్టెంబరు 15 :ఎస్ఆర్‌పీ అగ్రహారంలోని రేషన్‌డీలరు మున్నలూరి నాగవెంకటపద్మావతిపై కేసు నమోదు చేశామని సివిల్ సప్లయిస్ డీటీ మహేష్ తెలిపారు. ఆదివారం ఎస్ఆర్‌పీ అగ్రహారంలోని దుకాణం వద్ద, గణపవరం మండలం ఎస్.కొందేపాడు గ్రామానికి చెందిన ఎం.శివమణికంఠ అనే వ్యక్తి వెయ్యి కేజీల బియ్యాన్ని కొనుగోలు చేసి తీసుకుని వెళుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పట్టుకుని సీజ్ చేసి ఇరువురిపై కేసు నమోదు చేశామని సీఎస్‌డీటీ మహేష్ తెలిపారు.

ప్రేమను తిరస్కరించిందని యువకుడి ఆత్మహత్య

ఆకివీడు, సెప్టెంబరు 15 : ఓ వివాహిత ప్రేమను తిరస్కరించడంతో ప్రేమికుడు తన ఇంటిలో చీరతో ఉరేసుకుని చనిపోయిన ఘటన కళింగగూడెంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ హనుమంతు నాగరాజు తెలిపిన వివరాలివి.. గ్రామంలో సువారి గణేష్ (23) తన అక్కతో కలిసి ఉంటున్నాడు. గణేష్ నాలుగేళ్ళుగా రొయ్యల ఫ్యాక్టరీలో పనికి వెళ్ళేవాడు. అక్కడ గణపవరానికి చెందిన ఓ వివాహితను ప్రేమించాడు. ఆమె తిరస్కరించడంతో మనస్తాపం చెంది తన నివాసంలో చీరతో ఉరి వేసుకొని మరణించాడు. గణేష్ మావయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

నరసాపురం టౌన్, సెప్టెంబరు15: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని లాకులు సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన గునిశెట్టి నాగులు(35) మృతి చెందాడు.. బైక్ నుంచి కింద పడిన అతడి తలమీద నుంచి లారీ వెళ్లడంతో సంఘటన స్థలంలోని మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని పోలీసులు తెలిపారు.


ఎమ్మెల్యే అంజిబాబుకు రూ.2.50 లక్షలు అందిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్


ఎమ్మెల్యే అంజిబాబుకు రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న ఆర్యన్ సీఫుడ్స్ యాజమాన్యం


తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు విరాళం చెక్కు అందిస్తున్న దాతలు


తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు విరాళాలు అందజేస్తున్న దాతలు

వరద బాధితులకు ఆపన్నహస్తం

భీమవరంటౌన్, సెప్టెంబరు 15 : ప్రతి ఒక్కరూ విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మానవత్వంతో ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ. 2లక్షల 50 వేలు వరద బాధితులకు సహాయార్థం ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మానెపల్లి సత్యనారయణ గుప్తా, తుమ్మలపల్లి శివ, బోండా సత్యనారాయణ, కురిశేటి సత్యనారాయణమూర్తి, కురిశేటి సాయిరామ్‌కుమార్, కుర్మల రాజా, మానేపల్లి బదిరి, కుర్మాల పూర్ణరావు, కొక్కిరాల ఫణి, తటవర్తి బాబీ పాల్గొన్నారు. పలువురు దాతలు రూ.3 లక్షల సహాయాన్ని, చింతలపాటి రాజంరాజు (రాజబాబు) రూ.2లక్షలు, విశాఖపట్నంకు చెందిన కలిదిండి నరసింహరాజు రూ.లక్ష విరాళం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు దాతలు రూ.2లక్షల 50 వేలు, జనసేన పార్టీ రాయలం-1 ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి శివకృష్ణ రూ.25 వేలు, ఆర్య సీఫుడ్స్ రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే అభినం దించారు. కొనిశెట్టి రామలింగేశ్వరరావు (లింగబాబు), మాగపు భగత్‌సింగ్, యర్రంశెట్టి రాజేష్, సమ్మెట రాంజీ, టీడీపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, రమేష్‌బాబు పాల్గొన్నారు.

● భీమవరంటౌన్ : విజయవాడ వరదబాధితుల సహాయార్థం భీమవరానికి చెందిన వైద్యులు నాగిడి హరిశ్చంద్రప్రసాద్, నాగిడి వెంకటపద్మ లక్షా 50 వేల రూపాయలను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబుకు ఆయన కార్యాలయంలో అందించారు. దంపతులను అంజిబాబు అభినందించారు.

● తాడేపల్లిగూడెం అర్బన్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదివారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఎమెల్యే బొలిశెట్టికి పలు వురు విరాళాలు అందజేశారు. వీరంపాలెంకు చెందిన కేతిరెడ్డి రాంబాబు రూ. 25 వేలు, నడింపల్లి సత్యనారాయణరాజు రూ.50వేలు, తాడేపల్లిగూడెం క్రిస్ట్ లూథరన్ చర్చి నుంచి రూ. లక్ష, విఘ్నేశ్వర హోల్‌సేల్ పండ్ల వర్తక సంఘం రూ. 50 వేలు, తాడేపల్లిగూడెం పిరమిడ్ స్పిరిచ్యు వల్ సొసైటీ రూ 32, 500 లు, మారంపల్లి నుంచి రజక సంఘం రూ. 10 వేలు, అమృతపురం నుంచి సుబ్బరాజు రూ. 25 వేలు ఎమ్మెల్యేకు అందజేశారు.

● తాడేపల్లిగూడెం అర్బన్:వరద బాధితుల సహాయార్థం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పిలుపు మేరకు పలువురు టీడీపీ నాయకులు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వలవల బాబ్జికి విరాళాలు అందజేశారు. కొండ్రుపోలు గ్రామం నుంచి టీడీపీ నాయకులు రూ. 50 వేలు, మునుకుట్ల మల్లిక్ రూ. 10 వేలు విరాళాలు అందజేశారు.

● తణుకు : వరద బాధితుల సహాయార్థం తణుకులోని ఆదర్శ స్కూలు యాజమాన్యం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 40 వేల చెక్కును ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందించారు. స్కూలు డైరెక్టర్లు బసవా రామకృష్ణ, బాబు ఆంటోనీ, కె.శ్రీనివాసు పాల్గొన్నారు.

● తణుకు : విజయవాడ వరద బాధితులకు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తాతపూడి మారుతీరావు సతీమణి కామేశ్వరి మహిళా బృందంతో ఆంధ్రా షుగర్స్, హౌసింగ్ బోర్డు కాలనీలో సేకరించిన నిత్యావసరాలను విజయవాడలోని సింగ్ నగర్, వాంబే కాలనీ వరద బాధితులకు ఆదివారం పంపిణీ చేశారు. 800 చీరలు, 200 ప్యాంట్లు, షర్టులు, 400 చిన్నపిల్లలు దుస్తులు, వంద దుప్పట్లు, 600 దోమల అగరబత్తీలు, అగ్గిపెట్టెలు, వంద టవల్స్‌ను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాలు మేరకు పంపిణీ చేసినట్టు మారుతీ రావు చెప్పారు. కలగర వెంకట కృష్ణ, ఒమ్మి రాంబాబు పాల్గొన్నారు.


వలవల బాబ్జికి విరాళాలు అందజేస్తున్న కొండ్రుప్రోలు టీడీపీ నాయకులు


ఎమ్మెల్యే అంజిబాబుకు రూ.1.50 లక్షలు అందించిన వైద్యులు నాగిడి హరిశ్చంద్రప్రసాద్, వెంకటపద్మ


విజయవాడలో వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న తణుకు మాజీ కౌన్సిలర్ మారుతీరావు తదితరులు

మానవ విలువలను తెలిపే పుస్తకం 'సంగమం'


సంగమం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 15 : పెనుగొండకు చెందిన ప్రముఖ రచయిత ఎంఆర్‌వీ సత్యనారాయణ మూర్తి తన రచన ద్వారా సమాజ విలువలకు ప్రాధాన్యత నిచ్చారని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం ఉదయం మంత్రి కార్యాలయంలో ఎంఆర్‌వీఎస్ మూర్తి రచించిన సంగమం పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయితను అభినందించారు. పుస్తకాలపై ఆసక్తి తగ్గిపోతున్న నేటి రోజుల్లో ఇంకా రచనలు చేస్తూ సమాజ వికాసానికి మూర్తి పాటు పడుతున్నారన్నారు. రచయిత భార్య ఎం.రాజేశ్వరి, విద్యావేత్త బొక్కా రమాకాంత్, పెనుగొండ కళాశాల అధ్యాపకులు బీవీ రమణ, ఏఎస్‌వీ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఉండి బస్టాండ్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతా : రఘురామ

ఉండి, సెప్టెంబరు 15:ఉండి బస్టాండ్‌ను మోడల్‌గా తీర్చిదిద్ది ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం ఉండి బస్టాండ్, పంట కాల్వ, ఉండి సెంటర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఉండిలోని శ్రీరామక్షేత్రాన్ని ఆయన దర్శించుకున్నారు. జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మరళీ మోహన్‌రావు

వాకర్స్ అంటే నడకే కాదు.. సేవల్లోనూ ముందుండాలి

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 15 : వాకర్స్ అంటే నడకకే ప్రాధాన్యం కాదని, సేవా మార్గంలోనూ ముందుండాలని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి.మురళీమోహన్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సమావేశం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. క్షీరపురి వాకర్స్ క్లబ్, పాలకొల్లు వాకర్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడతూఃఈ వాకర్స్ క్లబ్‌లు అందించే సేవలు పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలన్నారు. అనంతరం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడారు. ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. క్షీరపురి వాకర్స్ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు టి.సుధాకర్, క్యాబినెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


చినమామిడిపల్లిలో నాగ వరసిద్ధి వినాయకుడికి రూ.6 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ


కాళ్ళలో వేలం పాటలో లడ్డూ ప్రసాదం దక్కించుకున్న భక్తులు


తణుకులో పెద్ద లడ్డూను పాటదారుడికి అందిస్తున్న కమిటీ సభ్యులు

బై.. బై.. గణేశా

▸ భారీగా గణనాథుల విగ్రహాల నిమజ్జనాలు

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిదో రోజు ఆదివారం పురస్కరించుకుని అధిక సంఖ్యలో గణనాథుల విగ్రహాలను వైభవంగా నిమజ్జనం చేశారు. డిజే, తీన్మార్ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో యువత కేరింతల నడుమ నిమజ్జనాలు చేశారు.

నరసాపురం టౌన్/మొగల్తూరు,సెప్టెంబరు15: వశిష్ఠా గోదావరిలో ఆదివారం భారీగా గణనాథుడి విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి. దాదాపు 20 విగ్రహాల పైనే క్రేన్ సాయంతో గోదావరిలో కలిపారు. స్టీమర్‌రోడ్, పాలకొల్లు రోడ్ గణేష్ ఊరేగింపులతో సందడిగా కనిపించింది. రాయపేటలో రాయల్ యువకుల ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాటను పడాల వెంకట సుబ్బారావు రూ.60వేలకు దక్కించుకున్నారు. చినమామిడిపల్లి నాగారమ్మగుడి వద్ద నాగ వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో రూ.6 లక్షలతో ప్రత్యేక అలంకరణ చేశారు. మొగల్తూరు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిమజ్జనాలు చేశారు.

● కాళ్ళ/పాలకోడేరు, సెప్టెంబరు 15 : కాళ్ళ మండలం కలవపూడిలో వున్న గణనాథుడిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళ్ళలో పాండురంగస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సంపత్ వినాయకుని నిమజ్జనం సందర్భంగా లడ్డూ ప్రసాదాలను వేలంపాటలో కాళ్ళ హెచ్‌పీ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న శ్రీనివాస్ 25 కేజీల లడ్డూను రూ.25,000, లక్ష్మీనారాయణ 5 కేజీల లడ్డూను రూ.10,000లకు దక్కించుకున్నారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలోని పంట కాల్వ గట్టుపై ఉన్న వినాయక గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి గ్రామస్థులు నిమజ్జనం నిర్వహించారు.

● పాలకొల్లు అర్బన్/యలమంచిలి : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పాలకొల్లులో పలు పందిళ్ళవద్ద వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను యువజన కమిటీ సభ్యులు ఊరేగింపు నిర్వహించి నరసాపురం కాలువలో నిమజ్జం చేశారు. పలు పందిళ్ల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. యలమంచిలి మండలంలోని యలమంచిలి, మేడపాడు, అడవిపాలెం, చించినాడ, దొడ్డిపట్ల, గుంపర్రు, తదితర గ్రామాల్లో గణేష్ విగ్రహాల ఊరేగింపు అనంతరం వశిష్ఠ గోదావరిలో నిమజ్జనం చేశారు.

● తణుకు : తణుకు పట్టణంలోని కుచ్చర్లకోట వారి వీధిలో శ్రీలక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి ప్రసాదం లడ్డూను సంభవ్ జ్యూయలర్స్‌కు చెందిన కుడరి ఆనంద్ రూ.లక్షా పది వేలుకు, చిన్న లడ్డూను జై హనుమాన్ ఆటో ఏజెన్సీస్ రూ. 27 వేలకు దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 22వ వార్డు పూతుకుచ్చు వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మాజీ కౌన్సిలర్ కీర్తి శివప్రసాదు ఆధ్వర్యంలో సరస్వతీ పూజలు జరిగాయి.

● గణపవరం : గణపవరం మండలం మల్లపురాజు పేటలో గణనాథునికి పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్, ఏలూరు జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు దంపతులు పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. గణపవరంలోని గొల్లలదిబ్బ గణపతి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి లడ్డూ వేలం పాటలో కమిటీ సభ్యులు రూ.90 వేలకు దక్కించుకున్నారు. పొత్తూరి లోకేశ్‌వర్మ, కూసంపూడి సురేంద్ర కుమార్‌రాజు, దాట్ల సత్తిబాబు, ఎన్.కిరణ్‌కుమార్‌రాజు, పవన్‌కుమార్ వర్మ, ఎన్.సతీష్‌రాజు, పీ.రామకృష్ణంరాజు, డీ.రమణరాజులు లడ్డూ అందుకున్నారు.

● ఆచంట : కరుగోరుమిల్లి శివారు ముత్యాలవారిపాలెంలో విజయగణపతి మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి లడ్డూను వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన యాతం నాగరాజు, హైమావతి దంపతులు రూ. లక్షా 35 వేలకు దక్కించుకున్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం సవిత్సపేటలోని గణపతి మండపంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, నరిసే సోమేష్ స్వామికి పూజలు చేశారు.

ఆళ్వార్లకు ప్రత్యేక తిరుమంజనోత్సవం

పాలకొల్లుఅర్బన్, సెప్టెంబరు 15: స్థానిక అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు మూడోరోజు ఆదివారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఆళ్వార్లకు తిరుమంజనోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ప్రధానార్చకులు పండితులు ప్రత్యేక వేదపఠనం గావించారు. అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం గావించారు. కార్యక్రమాల్లో ఈవో బీవీవీఎస్ శంకర్, సిబ్బంది, భక్తులు నున్న కోటేశ్వరరావు, మాజేటి రాంబాబు, చక్కా కుమార్, మామిడి బాబు, మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారికి పవిత్ర సమర్పణ గావించారు.

ఇంజనీర్లు దేశ భవిష్యత్తు రూపశిల్పులు

▸ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు


విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిట్ ఆచార్యులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 15 : ఇంజనీర్లు దేశానికి రూపశిల్పులని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీవీ వీరేష్‌కుమార్ అన్నారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ఆధ్వర్యంలో, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో నిట్ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా ఇంజనీర్స్ దినోత్సవం నిర్వహించారు. ఆచార్యులు డాక్టర్ వీ.సందీప్, సాస్ అసిస్టెంట్ డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం అర్బన్/భీమవరం క్రైం, సెప్టెంబరు 15 : భారతదేశ ఇంజనీరింగ్ వ్యవస్థలో మొట్టమొదటి ఇంజనీర్‌గా ఎన్నో నీటి ప్రాజెక్టులు నిర్మించిన వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని భీమవరం సిటిజన్ ఫోరం అధ్యక్షుడు బొండా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఇంజనీర్స్ డే సందర్భంగా విశ్వేశ్వరయ్య జయంతిని విజ్ఞాన వేదిక సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. భీమవరం రైల్వే జంక్షన్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజనీర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీవిజ్ఞాన వేదిక, హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైల్వే డివిజనల్ ఇంజనీర్ అందే శంకర్ రామాంజనేయులు మాట్లాడారు. భీమవరం రైల్వే ఇంజనీర్ వై.రాంబాబు, కె.మనోహర్, మోహన్, సయ్యపురాజు సూర్యనారాయణరాజు మాట్లాడారు. అనంతరం ఆరుగురు ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. శ్రీచెరుకువాడ రంగసాయి, హౌసింగ్‌బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సరిపిడకల రామారావు, కంతేటి వెంకటరాజు, కె.బాల పాల్గొన్నారు.

● ఆకివీడు/ఆకివీడు రూరల్ : ఆకివీడు, ఆదర్శ, అభయ, ఆక్వా, లియో లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో లయన్ పాస్ట్ డిస్టిక్ గవర్నలు ఎంవీఎస్ రాజు, గట్టెం మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఏడీ శ్రీనివాసరావు దంపతులను సన్మానించారు. క్లబ్ ప్రముఖులు గొంట్లా కృష్ణమూర్తి, దాట్ల రామరాజు, ఆర్వీఎస్ సూర్యనారాయణరాజు, కాకర్ల రాజరాజేశ్వరి, తదితరులు ఉన్నారు. ఇంజనీర్స్ కృషితోనే ఉప్పుటేరు వరద ముప్పు తగ్గిందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఇంజనీర్స్ డే సందర్భంగా బుడమేరు వరద నీరు కొల్లేరు ద్వారా ఉప్పుటేరులోకి వచ్చేలోపు ఉప్పుటేరు రైల్వే వంతెన వద్ద పేరుకుపోయిన కిక్కస, తూడు గుర్రపుడెక్కను ముందుగానే తొలగించి, వరద ప్రమాదాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషించిన ఆకివీడు సబ్ డివిజన్ జేఈ వెంకటేశ్వరరావును మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ అంగరరామ్మోహనరావు పాల్గొన్నారు.

● మొగల్తూరు, : మొగల్తూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వివేకా స్కూల్‌లో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న కత్తుల అప్పాజీ, పులపర్తి మణికిరణ్‌లను లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉండవల్లి గీతా రాంబాబు, తణుకుల రామకృష్ణ ఘనంగా సన్మానించారు.

● తణుకు : నిర్మాణ రంగంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్పా బలరామకృష్ణ అన్నారు. ఆదివారం ఇంజనీర్సు డే సందర్భంగా లయన్స్ క్లబ్ హాలులో ఇంజనీర్లు బి.విజయకుమార్, ఏఈ అలీస్టిన్, కె.సాయి ప్రవీణ, సాయి గోపాలకృష్ణను సత్కరించి, మెమెంటోలు అందజేశారు.

దగ్గులూరులో బసవేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 15 : దగ్గులూరులో నూతనంగా నిర్మించిన విశ్వగురు మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం పాల్గొన్నారు. బసవేశ్వరుని విగ్రహంతో రానున్నకాలంలో దగ్గులూరు మహా పుణ్యక్షేత్రంగా రూపు దిద్దు కుంటుందన్నారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మలను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు, మాజీ ఎంపీపీ సామంతపూడి అవతారంరాజు, గ్రామ సర్పంచ్ కనక భద్రం, వాసా బసవ కోటయ్య, కోడి విజయ భాస్కరం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు రామకృష్ణారావు మృతి

ఆకివీడు, సెప్టెంబరు 15 : సీనియర్ జర్నలిస్టు కిమిడి రామకృష్ణారావు (90) శనివారం అర్ధరాత్రి వయోభారంతో తన నివాసంలో కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆకివీడు కేంద్రంగా 1962లో జర్నలిస్టుగా తన ప్రస్థానం ప్రారంభించి, పలు దినపత్రికల్లో పనిచేశారు. జర్నలిస్టుగా దశాబ్దాలుగా కొల్లేరు ప్రాంతంలో అనేకస మస్యలను వెలికి తీయడంతో తనదైన శైలిలో కృషి చేశారు. అనేక మంది యువ విలేకర్లకు మార్గదర్శిగా నిలిచారు. పలువురు రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు, విలేకర్లు, బంధువులు నివాళులర్పించి సంతాపం తెలిపారు.

కన్నుల పండువగా దీపోత్సవం



పెనుగొండ, సెప్టెంబరు 15 : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా సిద్ధాంతం మేడిశెట్టి వారి పాలెం వీధిలో చవితి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి బడేటి దుర్గాశ్రీనివాస్, నాగమణి దంపతులచే శ్రీ విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, గరిక పూజలు నిర్వహించారు. అనంతరం స్వస్తిక్, శివలింగం, ఓం, జైజై పలు ఆకృతులతో ప్రమిదలు వెలిగించి దీపోత్సవం నిర్వహించారు. గురువారం స్వామివారి గ్రామోత్సవం, అన్నసమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ వారు తెలిపారు.

కెమిస్ట్రీ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

ఆకివీడురూరల్,సెప్టెంబరు 15 :దుంపగడపల ఏకేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ కోరారు. పీజీలో కెమిస్ట్రీ సబ్జెక్టులో 50 శాతం మార్కులు సాధించి ఉండాలని, గతంలో పనిచేసిన వారికి, ఉద్యోగ విరమణ చేసినవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోగా కాలేజీలో సంబంధిత సర్టిఫికెట్లు, రెండు ఫోటోలు సమర్పించాలన్నారు. 18న ఉదయం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

రికవరీ సొమ్ము బాధితుడికి అందజేత

ఆకివీడు, సెప్టెంబరు 15 : ముద్దాయి నుంచి పోలీసులు రికవరీ చేసిన రూ.1.50లక్షలు శ్రావణీ జూయలర్స్ యజమాని కర్రి పెద్దిరాజుకు జడ్జి సమక్షంలో అందజేశారు. స్థానిక పొట్టి శ్రీరాముల విగ్రహం సమీపంలో శ్రావణి జూయలర్స్ దుకాణంలో 40 గ్రాముల బంగారం.. రూ.2.40 లక్షలు విలువచేసే ఐదు జతల చెవి దిద్దులు జూలై 5న మహిళలు దొంగిలించిన సంగతి తెలిసిందే. గుమస్తా అబ్దుల్ గఫూర్ ఫిర్యాదు మేర పోలీసులు కేసు నమోదు చేశారు. ముద్దాయిను 22న అయి-భీమవరంరోడ్‌లో అరెస్టు చేసి రూ.1.50లక్షలు సీజ్ చేశారు. శనివారం లోక్ అదాలత్ ద్వారా జడ్జి, న్యాయవాది, ఎస్ఐ హనుమంతు నాగరాజు సమక్షంలో బాధితుడికి నగదు అందచేశారు.